# మనసు పొరల్లో

డా॥ వాసా ప్రభావతి

ఇంటి ముందు ఆటో ఆగిన చప్పుడు కాగానే అనసూయమ్మ వీధి తలుపు తీసి తొంగి చూసింది. పెట్టె చేతపట్టి ఎవరో తమ గేటు తీస్తున్నారు.

మిట్టమధ్యాహ్నపు మిల మిల ఎండలో గుర్తు పట్టలేక కళ్ళకు చెయ్యి అడ్డు పెట్టుకుని మరోసారి చూసింది. తన కొడుకు శ్రీకాంత్. మూడేళ్ళ తరవాత తిరిగి ఇంటికి వస్తున్నాడు.

"బాబూ, శ్రీకాంత్! రా రా లోపలికి." మనసు పొంగివచ్చే వాత్సల్యమంత మాటల్లో కలిసి ఉక్కిరి బిక్కిరి చేస్తుంటే ఆమె మాటలు తడబడుతున్నాయి.

ఆమె వెంట శ్రీకాంత్ ఇంట్లో అడుగు పెట్టాడు.

"ఏమండీ! అబ్బాయి వచ్చాడండీ!" ఆమె ఆయన కూర్చున్న కుర్చీవైపు చూసింది.

భర్త రామశేషయ్య విసురుగా కుర్చీలోంచి లేచి గదిలోకి వెడుతూ కనిపించాడు. ఆయన ముఖం అప్పుడు చూసింది. చండమార్తాండునిలా సెగలు కక్కుతున్న కళ్ళతో కనిపించింది.

పలకరించని తండ్రిని చూసి కొడుకు చిన్నబుచ్చుకుంటా డనుకున్న ఆ మాతృమూర్తి శ్రీకాంత్‌వైపు చూసింది. ఎండలో ఎర్రబడిన ముఖం. కళ్ళలో క్రోధం లేదు. ప్రజ్వరిల్లబోతున్న సూర్యుడిలా కనిపించాడు.

"కాళ్ళు, చేతులు కడుక్కో. కాఫీ పట్టుకొస్తాను."

శ్రీకాంత్ పెట్టె తన గదిలో పెట్టుకుని కాళ్ళు, చేతులూ కడుక్కుని వంటింట్లోకి వెళ్ళాడు. దగ్గరగా తల్లిని చూడగానే అతని మనసు తేలికయింది.

"మీ నాన్నగారు ఎప్పుడూ ఇంతే! ఎవరితో ఆత్మీయంగా ఉంటారని? అదేం నువ్వు పట్టించుకోకు" - ఆవిడ కాఫీ గ్లాసు అందించింది.

ఇన్నాళ్ళూ తల్లి ఆత్మీయత తలుచుకుంటున్నాడు. ఈనాడు ఆ ఆత్మీయత అందుకుంటున్నాడు. అతని ప్రయాణపు బడలిక తీరిపోయింది.

"అమ్మా! నీ ఒంట్లో ఎలా ఉంది?"

"ఇదిగో ఇలాగే బాగానే ఉన్నా కదా!" ఆమె కళ్ళలో నీటిపొర కమ్ముకుంది. కొడుకు కంట పడకూడదని ముఖం పక్కకు తిప్పుకుంది. శ్రీకాంత్ పసివాడు కాదు. అమాయకుడు అంతకన్నా కాదు. తల్లి బాధనూ, తండ్రి కఠినత్వాన్ని ఎప్పుడో తెలుసుకున్నాడు.

"స్నానం చేసి రా. అన్నం వడ్డిస్తాను." ఆ కాసేపట్లోనే మనసు కుదుటపరచుకొని మాట్లాడింది.

అప్పటికే రామశేషయ్యగారి భోజనం పూర్తయింది. కొడుక్కి భోజనం వడ్డించింది. కొడుకు చాలా రోజులకు వచ్చినందువల్ల ఆమెలో ఆ సంతోషం కొట్టవచ్చినట్లు కనబడుతోంది. ఆ సంతోషం మరొకరితో పంచుకోవాలని ఉంది. ఇల్లంతా కలియతిరగాలని ఉంది. కాని భర్తకు భయపడి అంత సంతోషాన్నీ మనసులోనే దాచుకుంది.

శ్రీకాంత్ స్నానం చేసి వచ్చి కంచం ముందు కూర్చున్నాడు.

"నీ కిష్టమని మామిడికాయ పప్పులో వేశాను. చల్లమిరపకాయలు కూడా వేయించాను. అదేం కలుపుకోవడం? అన్నం మరి కాస్త కలుపుకో." నేతి గిన్నెలో సగం నెయ్యి కంచంలో ఒంపింది.

"ఇక చాలు. ఇంత నెయ్యా అమ్మా? ఇదంతా నా పొట్టలోకి వెడితే నే వెళ్ళేనాటికి గుమ్మం పట్టనమ్మా!"

"ఊరుకోరా! మీ తాతగారు ఈ గిన్నెడు నెయ్యా ఒంపుకునేవారు."

"అప్పటి తాతగారితో ఇప్పటి నన్ను పోల్చ కమ్మా!"

"వెయ్యవే. ఆగావేం? ఆ గిన్నెడు నెయ్యా ఒంపేసెయ్యి. ఒళ్ళు కొవ్వెక్కిన నీ కొడుకు మరింత కొవ్వెక్కి తిరుగుతాడు. పీకలవరకు మెక్కబెట్టడం కాదు. ఈసారేనా పెళ్ళికి ఒప్పుకుంటాడో, లేదో అడిగావా?"

రామశేషయ్య మాటలు వారి చెవుల్లో పెద్దపులి గాండ్రింపుల్లా వినబడ్డాయి.

ఆమె చేతిలో ఉన్న పప్పు గరిట వణికింది. శ్రీకాంత్ నోట్లో పెట్టుకోబోతున్న ముద్ద జారి కింద పడింది.

"ముప్పై ఏళ్ళు దాటుతున్నాయి. సగం జుట్టు నెరిసింది. ఇం కెప్పుడురా పెళ్ళి? ఈసారేనా పెళ్ళికి ఒప్పుకోకపోతే నీ ముద్దుల కొడుకుని ఈ గుమ్మం తొక్కద్దని చెప్పు. వినబడుతోందా?"

ఆ అరుపులకి అక్కడి గాలి స్తంభించిపోయి, ఆ ఇద్దరికీ ఊపి రాడలేదు. ముచ్చెమటలు పట్టాయి. ఆ అరుపులు అలవాటే. అయినా ఎప్పటికప్పుడు కొత్తే! "నిన్నే! వినబడిందా?" రెట్టించాడు రామశేషయ్య. కోపంతో ఊగిపోతున్నాడు.

"వినబడింది." పది లంఖణాలు చేసిన వారి మాటల్లా నీరసంగా ఉన్నాయి ఆమె మాటలు.

"నాకు సమాధానం కావాలి. పెళ్ళికి అంగీకరించని పక్షంలో నీకు, నీ కొడుక్కి ఇవే ఆఖరి చూపులు!"

మాటల కంటే వేగంగా ఆయన తిరిగి గదిలోకి వెళ్ళి తలుపులు మూసుకున్నాడు.


అక్కడ గాలి తిరిగి చలించింది. తల్లీ, కొడుకులు గట్టిగా ఊపిరి పీల్చుకున్నారు. "ఏరా బాబూ! మీ నాన్నగారి మాటలు విన్నావు కదా? ఆయన పంతం మనకి తెలియంది కాదు. పెళ్ళి విషయం ఆలోచించరా!"

"ఇప్పు డేమంత తొందరమ్మా?"

"అలా అంటే ఎలారా! ఓ మూల వయసు వచ్చి మా నెత్తిన పడుతోంది. నా ఆరోగ్యం అంతంతమాత్రంగానే ఉంది. మీ నాన్నగారి సంగతి చెప్పనే అవసరం లేదు. హార్టు ఎటాక్ వచ్చి తగ్గిన తరువాత ఆయన కోపం మరింత పెరిగిపోయింది. నీ వో ఇంటివాడివైతే మాకు బెంగ ఉండదురా." ఆవిడ కళ్ళలోనుంచి వర్షాకాలపు జల్లులా కన్నీళ్ళు.

వాన నీటికి నేల కరిగినట్లు అతని హృదయం కరిగింది - ఒక నిర్ణయానికి వచ్చినట్లుగా - "సరే నమ్మా! మీ ఇష్టప్రకారమే కానీయండి" అన్నాడు. భోజనం పూర్తి కాకుండానే చెయ్యి కడుక్కుని తన గదిలోకి వెళ్ళి తలుపులు పెట్టుకున్నాడు.

అనసూయమ్మ సంతోషానికి అంతులేదు. అప్పటివరకూ కళ్ళలో నిండి ఉన్న విషాద



బాష్పాలే ఆనంద బాష్పాలై రెండు కళ్ళనుంచీ స్వాతిచినుకుల్లా జలజలా రాలాయి. ఒక్కసారిగా తిరిగి యౌవనం వచ్చినట్లుగా ఆమే లేచి రామశేషయ్యగారి గది ముందు నిలబడింది.

"ఇదుగో, విన్నారా? అబ్బాయి అంతా మీ ఇష్టమే అంటున్నాడు.

మంచంమీద పడుకున్న రామశేషయ్య ఒక్క ఉదుటున లేచి కూర్చున్నాడు - "ఇదిగో! నిన్నే ఆ టేబులు మీదున్న కవరు కనబడుతోందా! అ దిలా తే!"

"అబ్బాయి పెళ్ళికి అంగీకరించాడంటే ఈ కవరు దేనికండీ?"

"వెర్రిదానా! అసలు సంగతంతా దీంట్లోనే ఉంది. ఇందులోని కాగితాలన్నీ ఏమి టనుకుంటున్నావు? అబ్బాయి పెళ్ళికోసం వచ్చిన సంబంధాల వివరాలు. తెలిసిందా?"

అవన్నీ ఆయన ఎప్పుడు సేకరించారో తెలియని అనసూయమ్మ వాటిని చూస్తూ అలాగే నిలబడింది.

"నా మాటమీద నమ్మకం లేదా? అలా చూస్తూ నిలబడ్డా వెందుకు? ఇవన్నీ నీకు వివరంగా తరువాత చెబుతా కాని, ముందు కాస్త టీ చేసి పట్టుకురా!"

అయన మాట పూర్తి కాకుండానే ఆవిడ టీ తయారుచెయ్యడానికి వెనక్కి తిరిగింది.

కవరులోని కాగితాలన్నీ జాగ్రత్తగా తీసి ఆయన ఒకటికి రెండుసార్లు చదువుకున్నాడు. ఆయన దృష్టి ఒక చోట ఆగిపోయింది. మరోసారి చదివాడు. ఈసారి ఆయన కంఠం పైకి వినబడుతోంది. "తండ్రి తహసిల్దారు చేస్తున్నాడు. ఒక్కతే కూతురు. వెనకా ముందూ ఎవరూ లేరు. పిల్ల బికాం. పాసయింది. తెల్లగా ఉంటుంది."

టీ పట్టుకొచ్చిన అనసూయమ్మ వింటూ అలాగే నిలబడింది.

"కట్నం అడగవలసిన పనే లేదు. జాతకం కూడా వివరాలతో ఉంది. ఈ సంబంధం కుదిరితే లాటరీ వచ్చినట్లే."

ఆ వివరాల కాగితాలు తీసి పక్కన పెట్టుకుని మిగిలినవన్నీ తిరిగి కవరులో కుక్కుతున్నాడు.

"ఇదిగో టీ. అప్పుడే పెళ్ళి కుదిరినట్లే సంబరపడుతున్నారు" - తుమ్మ తోపులో పొద్దు పొడిచినట్లుగా ఉన్న ఆయన ముఖం చూసి అడిగింది.



"కాక ఏమి టనుకుంటున్నావు? ఎంత మంచి నంబంధం! ఇదిగో ఇప్పుడే వెళ్ళి బుచ్చిరావుకు జాతకం చూపించి వస్తాను." టీ గబ గబా చప్పరించి, గ్లాను ఆవిడకు అందించి, వెంటనే బయటుదేరాడు.

బుచ్చిరావు గుమ్మంలోనే కనిపించాడు: "రామశేషయ్యగారా? ఇలా వచ్చారేమిటి? రండి లోపలకి రండి." లోపలకి తీసుకెళ్ళి కుర్చీ చూపించాడు.

"ఇదిగో బుచ్చిరావ్గూ! మా అబ్బాయి జాతకంతో ఈ అమ్మాయి జాతకం నరిపడుతుందో, లేదో చూడాలోయ్!" రెండు జాతకాలూ బుచ్చిరావు చేతికి అందించాడు.

"మరీ చాదస్తానికి పోకు సుమా! కాస్త ముందూ, వెనకా చూడు చాలు."

రెండు జాతకాలూ చూసి వేళ్ళు లెక్కపెట్టి కాస్త తల అటూ ఇటూ తిప్పి పరిశీలించిన బుచ్చినరావు - "ఇంకేం చూడక్కరలేదు. భేషుగ్గా ఉన్నాయండి" అన్నాడు.

"ఇద్దరికీ నప్పే పెళ్ళి ముహూర్తం కూడా ఆ చేత్తోనే చూసి చెప్పు. ఎంత త్వరగా కుదిరితే అంత మంచిది."

మరోసారి వేళ్ళు లెక్కపెట్టాడు బుచ్చిరావు. "20వ తేదీ ఉదయం తొమ్మిది గంటలకు బ్రహ్మాండమైన ముహూర్తం ఉంది. అయినా ఇంకా పెళ్ళి చూపులూ, గట్రా అయినట్లు లేదు. అప్పుడే ముహూర్తంవరకూ వచ్చారు." నందేహంగా అడిగాడు.

"దాని కేముందోయ్? రేపే పెళ్ళిచూపులు ఏర్పాటు చేయమని కబురు చేస్తాను. అయినా మన అబ్బాయి అన్ని విధాలా నచ్చే కదా పిల్ల నిస్తామని వచ్చారు. మనం వారి నంబంధం నచ్చే కదా బయలుదేరుతున్నాం. ఇంకా ఆలస్యం దేనికయ్యా?" అతని చేతుల్లోని జాతకాల్ని అందుకుని వడివడిగా ఇంటివైపు బయలుదేరాడు.

దారిలో జ్ఞాపకం వచ్చి టెలిగ్రాం ఆఫీసుకు దగ్గర ఆగి - "రేపు సాయంకాలం 5 గంటలకు పెళ్ళిచూపులకు వస్తున్నా"మని టెలిగ్రాం ఇచ్చాడు.

భర్త రాకకోసం ఎదురుచూస్తున్న అనసూయమ్మ వీధి తలుపు తెరచుకుని చూస్తోంది. భర్త ముఖంలో ఎక్కడా కోపపు ఛాయలు కనపడలేదు. పైగా అతను పడే కంగారు శుభసూచకంగా అనిపించింది ఆమెకు.

"ఇదిగో రేపు సాయంకాలం మనం తహసిల్దారుగారి అమ్మాయిని చూడ్డానికి వారి ఊరు వెళుతున్నాం. వాడితో చెప్పు. రేపు మధ్యాహ్నం బస్సులో బయలుదేరాలి."

"జాతకం నప్పిందాండి?"

"నప్పకేం చేస్తుంది? చచ్చినట్లు నప్పింది." ఆయన మాటల్లో కోపానికి బదులు గర్వం తొణికిసలాడింది.

ఆయన మాటలు ఆవిడకు నరిగా అర్థం కాకపోయినా మరోసారి అడగడానికి భయమేసి ఊరుకుంది.

"వెళ్ళి వాడికి చెప్పు." మరోసారి చెప్పి ఆయన గదిలోకి వెళ్ళాడు.

వెంటనే ఆవిడ కొడుకు గదివైపు అడుగులు వేసింది. "రేపు మనం అమ్మాయిని చూడ్డానికి వెళ్ళాలట్రా. మీ నాన్నగారు చెప్పమన్నారు."

"అలాగా! అయినా ఆ అమ్మాయిని చూడ్డానికి నే నెందుకమ్మా? మీకు నచ్చితే నాకు నచ్చినట్లే. మీ రెళ్ళి చూసిరండి."

"అదేమిట్రా, పెళ్ళి చేసుకునేది నువ్వా మేమా? పిల్లని చూడకుండా ఎలాగరా?"

"దాని కేముంది? మీకు నచ్చితే ఒక ఫోటో పట్టుకురండి. అది కూడా మీ నంతృప్తికోసం. నాకైతే ఫోటో కూడా అవసరంలేదు."

కొడుకు ముఖంలో నంతోషం కనబడలేదు. అసలు ఏ భావమూ ఆమెకు కనబడలేదు. "అదేమిట్రా అలా అంటావు?" అంది.

"అనడాని కేముంది? మీరు పెద్దలు. ముందే చెప్పాను కదా! మీ ఇష్టమే నా ఇష్టం అని." ఈసారి అతని ముఖంలో కాస్త నవ్వు కనబడింది.

"ఏమిటో అనుకున్నాం. అబ్బాయికి మీ రంటే ఎంత గౌరవమండి? మనకి అమ్మాయి నచ్చితే వాడికి నచ్చినట్లేట. ఒక ఫోటో పట్టుకు రమ్మంటున్నాడు." తిరిగి భర్త దగ్గరకు వచ్చి గుక్క తిప్పుకోకుండా చెప్పింది అనసూయమ్మ.

పైకి గంభీరంగా ఉన్నా ఆయన కూడా మనసులో చాలా నంతోషించాడు. ఎంతైన తన కొడుకు తల్లిదండ్రులంటే గౌరవ, మర్యాదలు కలవాడు - అనుకున్నాడు మనస్సులో.

అనుకున్న ప్రకారం పెళ్ళి చూపులకి బయలుదేరి వెళ్ళారు భార్యా భర్త లిద్దరూ. పిల్ల తెల్లగా, బాగానే ఉంది. కాస్త బొద్దుగా ఉన్నా ముఖం కళ కళ లాడుతోంది. రామశేషయ్యగారి దృష్టి అంతా వా రింటిమీద, నౌకర్లమీదా, ఇంట్లో సామానుల మీదా ఉంది.

అవిడ దృష్టి పిల్లమీద ఉంది. పని పాటలన్నీ వచ్చునని విని నంతోషించింది. తన కొడుక్కి తగిన పిల్ల అనుకుంది.

కట్న కానుకల విషయాలు, లాంఛనాలు, పెళ్ళి ఎంత ఘనంగా చేసేదీ - అన్నీ అడక్కుండానే వారు ఏకరువు పెట్టారు.

మధ్య మధ్యలో కొన్ని జ్ఞాపకం చేశాడు రామశేషయ్య. నంబంధం ఖాయం చేసి ముహూర్తం నంగతి కూడా వియ్యంకునితో చెప్పేశాడు రామశేషయ్య. పిల్ల కాస్త లావుగా ఉండడంవల్ల, ఇంటర్ ఫేల్ అవడంవల్ల ఆ పిల్ల పెళ్ళికోసం బెంగ పెట్టుకున్న తహసీల్దారుగారు, భార్య నంతోషంతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. కావాలనే పిల్ల బి.ఏ. పానయిందని అబద్ధ మాడారు. పిల్ల ఫోటోలో మరింత లావుగా ఉండడంవల్ల - "ఫోటోలు లేవు బావగారు. ఇదే మొదటిసారి పెళ్ళి ప్రయత్నం కదండీ. పిల్లని ఫోటో తీయించి రేపే పంపిస్తామండి" అని ఒక చిన్న అబద్ధం ఆడారు.


"మన అదృష్టం కొద్దీ ముం దొచ్చాం. లేకపోతే లక్షల ఆస్తి ఎవరి పాలయ్యేదో!" అనుకున్నాడు మనసులో రామశేషయ్య.

నంతోషంగా ఇంటికి తిరిగి వచ్చారు భార్యా భర్త లిద్దరూ. కనపడ్డ వా రందరికీ అనసూయమ్మ వియ్యాలవారి గొప్పతనం, పిల్ల అందచందాలు వర్ణించి చెబుతూనే ఉంది.

ఇంకా పది రోజులే ఉంది పెళ్ళి. పెళ్ళి పనులు చురుగ్గా సాగిపోతున్నాయి. ముందుగానే వచ్చిన శ్రీకాంత్ చెల్లెలు కాదంబరి కనపడినప్పుడల్లా అన్నగారిని ఓ ఆట పట్టిస్తోంది. అంతకంటే తెలివిగా నమాధాన మిస్తూ తప్పించుకుంటున్నాడు శ్రీకాంత్. శుభలేఖలు వేసి అందరికీ పంచిపెట్టారు.

ఆ రోజు ఇల్లు మరింత నందడిగా ఉంది. చుట్టాలు రావలసిన వారంతా వస్తున్నారు. ఆ రాత్రే పెళ్ళి. మధ్యాహ్నం బస్సుకే పెళ్ళివారు బయలుదేరాలి. ఆ పొద్దుట రైల్లో రామశేషయ్యగారి అక్క, చెల్లెళ్ళు, వారి కొడుకులు, కోడళ్ళు, కూతుళ్ళు, అల్లుళ్ళు, బావమరుదులు, ఆవిడ అక్క, చెల్లెళ్ళు, కోడళ్ళు, కూతుళ్ళు అందరూ వచ్చేశారు. ఎవరికి చేయవలసిన మర్యాదలు వారికి జరుగుతున్నాయి. అంతలో బస్సు వచ్చి వీధిలో ఆగింది.

ముందుగా భోజనాలు పూర్తి చేసిన రామశేషయ్య అక్కగారితో పెళ్ళి నంగతులు చెబుతున్నాడు. ఆవిడ అడిగిన ప్రశ్నలకు



సమాధానాలు కూడా ఇస్తున్నాడు.

"ఇదంతా శ్రీకాంత్ అదృష్టంరా! మీ ఆవిడ లాంఛనాలు దండిగానే పుచ్చుకుంటోంది" అంది ఆ అవ్వగారు.

"అక్కా! ఈ అమ్మాయి ఎవరి కోడ లంటావు? లక్షణంగా ఉంది." చంటి పిల్లవాడిని ఎత్తుకుని అటుగా వెళుతున్న ఒక యువతిని చూసి అడిగాడు రామశేషయ్య. "మీ బావమరిది తాలూ కనుకుంటాను." తల తిప్పి ఆమెను చూసి సమాధాన మిచ్చింది ఆవిడ.

"మేము రైలు దిగి వస్తుంటే మాతోపాటే రైలు దిగింది. తాను కూడా ఈ పెళ్ళికి వస్తున్నాననీ, మీ ఎడ్రను చెప్పమనీ అడిగింది. అందుకే మేము మాతో తీసుకువచ్చాము. ఒకవేళ కాదంబరి స్నేహితురాలేమో!" అంది తిరిగి ఆవిడే.

"అయితే అయి ఉండవచ్చు. దానికి ఎంతమంది స్నేహితురాళ్ళో చెప్పలేము. ఎవరు కాస్త నవ్వుతూ పలకరించినా వాళ్ళని ఇంటికి తీసుకువస్తుందిలే" అన్నాడు రామశేషయ్య.

ఇక బయలుదేరే టైం అవుతోంది. ముందు సామానంతా బస్సు ఎక్కిస్తున్నారు. వారికి వీరికి ఏవేవో పురమాయిస్తున్నాడు రామశేషయ్య.

అప్పుడే అటుగా వచ్చిన కాదంబరిని పిలిచి - "ఆ అమ్మాయి ఎవరు తల్లీ?" అన్నాడు.

"ఎవరో నాకు తెలియదు నాన్నా! శ్రీకాంత్ అన్నయ్యతో రాగానే మాట్లాడింది. బహుశా అన్నయ్య స్నేహితురాలేమో!"

ఒక్కసారి రామశేషయ్య గుండెలో రైళ్ళు పరుగెట్టాయి. కాలి కింది భూమి జారినట్లయింది. వెంటనే నిలవలేక, ఆ పిల్ల ఎక్కడ ఉందో వెతకడం ప్రారంభించాడు.

ఆమె శ్రీకాంత్ గదిలో ఒక వారగా కూర్చుని పిల్లాడిని ఆడిస్తోంది. ఆయన తల్లినీ, పిల్లాడినీ గుచ్చి గుచ్చి చూశాడు. పిల్లాడి ముఖంలో శ్రీకాంత్ పోలికలు స్పష్టంగా కనబడ్డాయి. పరిశీలనగా చూస్తే ఎవరికైనా కనబడతాయి. చిన్నప్పటి శ్రీకాంత్ కళ్ళముందు మెదిలాడు. ఆయనకోపం తారస్థాయికి చేరుకుంది. ఆయన శ్రీకాంత్ గదిలో అడుగు పెట్టాడు.

"ఎవరు నువ్వు? ఎవరు రమ్మంటే ఇక్కడకు వచ్చావు?" ఆ అరుపుకు చంటిపిల్లాడు కెవ్వుమని గుక్కపెట్టాడు.

"శ్రీకాంతు శుభలేఖ పంపితే వచ్చాను."

"ఎవరు నువ్వు?" మళ్ళీ రెట్టించాడు రామశేషయ్య.

"ఈ అబ్బాయి మీ మనవడు మామగారూ!" ఏడుస్తున్న పిల్లాడిని రామశేషయ్యకి అంధించబోయింది.

పిల్లాడిని అందుకోకుండా రామశేషయ్య రెండడుగులు వెనక్కి వేశాడు - "నువ్వు నా ఇంటి కొచ్చి నాకే పాఠాలు చెబుతున్నావా? ముందు ఇక్కడనుంచి కదులు. లేకపోతే ఏం చేస్తానో నాకే తెలీదు."

"ఇవిగో, మీ కొడుకు నా మెడలో కట్టిన మంగళసూత్రాలు. వీడు మీ మనవడు. శ్రీకాంత్ రమ్మని రాశాడు. నేను వచ్చాను."

అది నిజమో, కాదో అతనికి తెలీడం లేదు. పెళ్ళి చెడగొట్టడానికి దాపురించింది అనుకున్నాడు.

"నువ్వు ఎవరివైనా నా కవసరం లేదు. నువ్వు నిజంగా తాళి కట్టించుకున్నందుకు రుజువేది? నేను నమ్మను. వెళ్ళి కోర్టులో దావా వేసుకో!" అంటూనే ఆమె జుట్టు పట్టుకుని శ్రీకాంత్ గదిలోనుంచి బయటకు లాక్కొచ్చాడు.

"మామయ్యగారూ! నాకు అన్యాయం చేయకండి. నిజంగా మీ అబ్బాయి నన్ను పెళ్ళి చేసుకున్నాడు. వీడు మీ మనవడు. ఇంతకంటే సాక్ష్యాలు నేను చూపించలేను." ఆమె ఏమీ చెయ్యలేక, ధైర్యం సడలి వెక్కి వెక్కి ఏడుపు ప్రారంభించింది.

అయినా ఆయన మొండిపట్టు వదలలేదు. ఆమె జడ పట్టుకుని దొడ్డిలోకి లాక్కువెళ్ళాడు. అక్కడ ఆమె ఏడ్చినా, మొత్తుకున్నా ఎవరికీ వినబడదని ఆయన ఉద్దేశం.

"శ్రీకాంత్! శ్రీకాంత్!" అంటున్న ఆమె ఆర్తనాదాలు ఇంట్లో అందరినీ కలవరపెట్టాయి. ఆమె చేతుల్లో పిల్లాడు మరింత గట్టిగా ఏడుస్తున్నాడు.

గబగబా అందరూ అక్కడకు చేరుకుని ఆశ్చర్యంగా చూస్తున్నారు. వారిలో శ్రీకాంత్ కూడా ఉన్నాడు.

"శ్రీకాంత్! ఈమె చెప్పేది నిజమేనా?"

"అవును నాన్నగారూ!" తల వంచుకునే సమాధాన మిచ్చాడు శ్రీకాంత్.

"ఈ పెళ్ళి ఎలా చెల్లుతుందో నే చూస్తారా!" రామశేషయ్య పళ్ళు పటపటా కొరికాడు.

"నాన్నగారూ! ఈమె నా భార్య. ఈ పిల్లాడు నా కొడుకు. మాకు పెళ్ళై రెండు సంవత్సరా లయింది. వాళ్ళింట్లో నేను ఉండేవాడిని. హఠాత్తుగా జబ్బుచేసి తల్లిదండ్రులు మరణిస్తూ ఈ పిల్లను నాకు అప్పచెప్పారు. నేను పెళ్ళి చేసుకున్నాను. ఈ విషయం మీతో చెప్పాలనుకున్నా. కాని మీరు తిట్టడం తప్ప నా మాట వినే అవకాశం నా కివ్వలేదు. మీకు ఎదురు చెప్పే ధైర్యం నాకు లేదు. నన్ను క్షమించండి. మీ కిష్టం లేకపోతే ఇక్కడి నుంచి వెళ్ళిపోతాం." ఆమె చేతుల్లోంచి పిల్లాడిని ఎత్తుకుని ఆమె కన్నీళ్ళు తుడిచాడు.

రామశేషయ్య కుప్పలా నేలమీద కూలిపోయాడు. ఆయన మనసులో అగ్నిపర్వతం బద్దలై లావా ప్రవహించడం ప్రారంభించింది.

అందరూ ఆయన చుట్టూ చేరారు.

భార్య - "ఏమండీ!" అంటూ బావురుమని ఏడ్చింది.

శ్రీకాంత్ వెళ్ళి డాక్టర్ని తీసుకువచ్చాడు. ఆయన్ని అందరూ కలిసి మంచంమీదికి చేర్చారు.

డాక్టరు పరీక్ష చేసి - "జబ్బేమీ లేదు. కాస్త విశ్రాంతి అవసరం" అంటూ మందులు రాసిచ్చి వెళ్ళిపోయాడు.

రామశేషయ్య మనస్సు గతంలోకి వెళ్ళింది. తను కూడా వయసులో ఒ కమ్మాయిని ప్రేమించి, పెళ్ళి చేసుకున్నాడు. ఒక పిల్లాడు కూడా పుట్టాడు. కాని తను ధైర్యం చేసి తల్లిదండ్రులతో చెప్పలేకపోయాడు. బలవంతంగా మరో యువతి మెళ్ళో తాళి కట్టాడు. తిరిగి ఆ ఊరు వెళ్ళి ఆమెకు మొహం చూపించలేకపోయాడు.

ఆమె తన మొహం లోకానికి చూపించలేక పిల్లవాడితో సహా చెరువులో పడి ఆత్మహత్య చేసుకుంది. అప్పటినుంచి ఏదో తెలియని బాధ, కోపం, ఆవేశం. ఎవరిని చూసినా కసి, కక్ష. ఈనాడు తన కొడుకు తన ముందు ధైర్యం చేశాడు. ప్రేమించిన స్త్రీని రక్షించుకున్నాడు. తను హంతకుడు. నరరూపరాక్షసుడు. తన కొడుకు దేవుడు. తనలా పిరికివాడు కాదు. అందుకే ఇంతమంది ఎదుటా శ్రీకాంత్ కాపురం నిలబెట్టాలి.

రామశేషయ్య మనసులో దావానలం చల్లారి అమృతంగా మారిపోయింది. కళ్ళు మిల మిలా మెరిశాయి. కర్తవ్యం గుర్తుకు వచ్చింది.

"బాబూ, శ్రీకాంత్! నీ భార్యతో ఇటు రారా. ఆ పిల్లాడిని నా పక్కన కూర్చోపెట్టరా!" అంటూ పిలిచాడు.

ఆ కంఠంలో ఏదో తీయని ఆత్మీయత. దాన్ని ఎవ్వరూ నమ్మలేకపోతున్నారు.

"శ్రీకాంత్, రారా!" ఆ పిలుపులో మరింత తీయదనం.

శ్రీకాంత్ భార్యతో, కొడుకు నెత్తుకుని తండ్రి ఎదుట నిలబడ్డాడు.

శ్రీకాంత్ చేతిని కోడలి చేతిలో పెట్టాడు. రామశేషయ్య సిద్ధంగా ఉన్న భాజాభజంత్రీలను వాయించమన్నాడు.

"బాబూ, శ్రీకాంత్! ఒక్క పొరపాటు జరిగిపోయిందిరా! ఆ తహసీల్దారుగారి అమ్మాయికి ఇక పెళ్ళి అవుతుం దంటావురా? ఆ పాపం మనదేరా!"

"మీరు బాధపడకండి నాన్నగారూ! వాళ్ళకి ముందే కబురు చేశాను. ఆ పిల్లకి ఈ ముహూర్తానికే మరో అబ్బాయితో పెళ్ళి జరుగబోతోంది." శ్రీకాంత్ సమాధానం ఆయనకి ఆనందాన్ని కలిగించింది. అనసూయమ్మ సంతోషానికి అంతులేదు.

ఆయన హఠాత్తుగా మారిపోవడానికి కారణం ఆమెకు తెలియలేదు. ఆయన మనసు పొరల్లో ఏముందో ఎవరికీ తెలియదు. "ఆయన మారారు. అంతే చాలు" అనుకున్నారు అంతా. ★

## భూగర్భ జలం

సకల జీవుల మనుగడకు తగిన పాళ్ళలో నీరు అవసరం. వర్షాల వల్ల నీరు సమకూరుతోంది. సకాలంలో తగినంత వర్షపాతం కురవడంలో వృక్షాల పాత్ర ఉంది. కురిసిన వర్షం నేలలో ఇంకినపుడే భూగర్భ జల వనరుల నిలువలు పెరుగుతాయి. భూగర్భ జల వనరుల నిలువలు పెంచడంలో అడవులు ప్రముఖ పాత్ర వహిస్తాయి. ఒక హెక్టారు అడవి మూడువేల క్యూబిక్ మీటర్ల నీటిని నిలువ చేస్తుందని శాస్త్రజ్ఞుల అంచనా.

- సమ్మెట గోవర్ధన్